కుక్కబుద్ధి

సాక్షి భీమారావు

సుంకయ్య అప్రయత్నంగా చెట్టుకింద ఆగాడు. చెమటతో పూర్తిగా తడిసి పోయిన మొహాన్ని, చెమటతో పూర్తిగా తడిసిపోయిన తుండు గుడ్డతో తుడుచుకున్నాడు.

ఉన్నట్టుండి ఏదో ఆవిరి సెగలు కక్కుతూ పైకి పొంగింది. పారిపోడానికి దారి దొరకనట్టు మూడు రోజులుగా కడుపులో సుళ్ళు తిరుగుతోంది నొప్పి. కడుపు నొప్పితో తొక్కలేక తొక్కి,

సంపాయించిన తొమ్మిది రూపాయిల్నీ అద్దె కింద లాక్కున్న రిక్షా వోనరు వర్షింపాం గుంత్తాడు సుంకయ్యకి. అయిదే వచ్చిందని చెప్పి, నాలుగు రూపాయిలు మిగుల్చుకుని వుంటే మందూ, తిండీ రెండూ దొరికేవి. అబద్ధం ఆడనందువల్ల తన కడుపు నొప్పికి మందూ లేదు. కడుపుకింత తిండీ లేదు.

ఉన్నట్టుండి మళ్ళీ నొప్పి ఏదో శూలంతో సుంకయ్య కడుపులో పొడిచింది. ఒక్కసారిగా ఒళ్ళంతా చెమట ఊరింది. ఒగురుస్తూ మళ్ళీ తుండుగుడ్డతో తుడుచుకున్నాడతను. బుద్ధి తెలిసినప్పట్నుంచీ తను చెమటలు కక్కుతూనే వున్నాడు... అయితే లోపలున్న చెమట చెలమ ఇంకా ఇంకి పోలేదు ఎందుకో! చెమట! పిక్కలు ముక్కలు చేసుకుని రిక్షా తొక్కే తన చెమట రిక్షాలో కూచున్న వాళ్ళు తన చెమట కంపు భరించలేక జేబురుమాళ్ళతో ముక్కులు మూసుకోడం తను చాలా చాలా సార్లే గమనించాడు. ఒక వ్యక్తి చెమట కక్కకుండా శుభ్రంగా వుండాలంటే మరో వ్యక్తి ఒక్కడే ఇద్దరి చెమటనీ కక్కాలని వాళ్ళకి తెలీదా?

సుంకయ్య మెల్లిగా కదిలాడు. కడుపు నొప్పి అతన్ని ముందుకు వొంగమని శూలంతో పొడుస్తూ ఆజ్ఞాపిస్తోంది. ధర్మాసుపత్రికి వెళ్తే...? తనకి వోపిక లేదు. తను నడవలేడు. ఈ నొప్పిని మోస్తూ. రిక్షాతొక్కి రెండు రూపాయిలు సంపాయించే సమయంలో ధర్మాసుపత్రి క్యూలో నుంచునే అవకాశం తనకి లేదు... ఇప్పుడు... రిక్షాని ఓనరుకి అప్పగించేశాక... రిక్షాలో వెళ్ళే అవకాశం అసలు లేదు. ఎంతో మందిని ఊరవతలున్న ధర్మాసుపత్రికి రిక్షాలో చేరవేసిన తనకి ఇప్పుడు రిక్షా లేదు!

పక్కవీధిలోకి తిరిగిన సుంకయ్య అసంకల్పితంగా ఆగాడు. కుడివేపున డాక్టరుగారింటి వైపు ఆశగా చూశాడు. ఆ డాక్టరు గారి ఆస్పత్రికీ తను చాలాసార్లు రోగుల్ని తీసుకెళ్ళాడు. వైద్య చేయించుకుని తిరిగి వెళ్ళే ఆడాళ్ళని జాగర్తగా తీసుకెళ్ళమని చెప్పినప్పుడు డాక్టరు గారు తనని ఒకటి రెండుసార్లు పలకరించారు కూడా... గుర్తుండి వుండొచ్చు. కంపెనీ వాళ్ళిచ్చిన శాంపుల్ మందులు తన లాంటి పేదోళ్ళకి డాక్టర్లు ఉచితంగా ఇచ్చేస్తారని ఎవరో అంటూంటే తను విన్నాడు. కడుపు నొప్పి సుంకయ్యని అంకుశంలా పొడిచింది. డాక్టరుగారి దగ్గరకు వెళ్ళమంది. సుంకయ్య తెరిచిన గేటు దాటి లోపలి కెళ్ళాడు...

వరండా మెట్ల మీద కారు ఆగి వుంది. సుంకయ్యకార్ని దాటి ముందుకెళ్ళాడు.

"త్వరగా రండి! టైటిల్స్ మిస్ అవుతాం!" కార్లోంచి డాక్టరుగారి భార్య అరిచింది.

"వస్తున్నా! వస్తున్నా!" డాక్టరు గారి కంఠం వరండా మీంచి దూసుకొచ్చింది.

డాక్టరుగారు సినిమా కెళ్తున్నట్టున్నారు. సుంకయ్య ఆదరాబాదరా వరండా వైపు కదిలాడు. వరండా మీద స్తంభం దగ్గర డాక్టరు గారు వంగి నుంచున్నారు.

"జానీ... కమాన్! గెటప్" డాక్టరుగారి కంఠం సుంకయ్యకి వినపడింది. గొలుసు నేల మీదపడి సన్నగా చప్పుడు చేసింది.

వీడియో

"ఏరా... ఎప్పుడూ రాత్రే భిక్షానికి వస్తావేం... పగలంతా ఏం చేస్తావ్"

"వీడియో చూస్తూ సమయం గడుపుతామ తల్లి..."

— ఉదయ్ దర్శనసాయి

"ఏమండోయ్!" కార్లోంచీ అమ్మగారు అరిచారు.

"వస్తున్నా, జానీని వదిలేసి వెళ్దాం... కాంపౌండులో తిరుగుతూ వుంటుంది..."

"అయ్యగారూ..." వరండా ముందున్న క్రోటన్ పక్కనే ఆగిన సుంకయ్య పిలిచాడు.

డాక్టర్ కరుణాకరం వెనక్కి తిరిగి సుంకయ్యను ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎవరు?"

"నేను... నేను... రిక్షా సుంకయ్యని బాబూ..."

"ఏంటి? ఎందుకొచ్చావ్?" డాక్టర్ కరుణాకరం కంఠంలో విసుగు గంటలా ధ్వనించింది.

"మూడు రోజులుగా... కడుపులో నొప్పి... గింగిర్లు తిరిగి పోతున్నా బాబుగారూ..." సుంకయ్య ఒగురుస్తూ అన్నాడు.

"మూడు రోజులుగా... ఏం చేస్తున్నావ్? నిద్రపోయావా?" సుంకయ్య నిర్లక్ష్యాన్ని ఎగతాళి చేస్తూ రోగుల నిర్లక్ష్యమే తనకి వరప్రసాదం అని తెలిసిన డాక్టర్ కరుణాకరం విసుగ్గా అన్నాడు. "అయినా ఇప్పుడొస్తే ఎలా? నేను అర్జెంటుగా బైటికెళ్తున్నా. రేపు..."

డాక్టర్ కరుణాకరం కంఠాన్ని సుంకయ్య కేక తటాలున మధ్యలోనే తుంచి, మింగేసింది.

వరండా మీంచి చప్పుడు కాకుండా కిందికి దిగిన జాతి కుక్క జానీ, సుంకయ్య పిక్కని వెనక నుంచీ పళ్ళ మధ్య బిగించింది. కత్తుల్లాంటి పళ్ళు కసుక్కున దిగాయి. సుంకయ్య కంగారుగా అరుస్తూ కాలిని విదిలించాడు. చర్మాన్నీ, కండనూ కొక్కేల్లా చీల్చుతూ జానీ పళ్ళు జారాయి.

విసురుగా దూరంగా జరిగిన జానీ ఏమీ ఎరగనట్టు నించుంది. రక్తం సుంకయ్య మడమదాకా వెచ్చగా పాకింది.

"ఏంటయ్యా? ఏమైంది?" డాక్టర్ కరుణాకరం కోపంగా అరిచాడు.

అప్రయత్నంగా వరండా మెట్ల మీదికి గెంతి, పిక్కని అరచేత్తో కప్పుకున్న సుంకయ్య కంఠంలో భయం, బాధా జంట స్వరాలుగా పలికాయి.

"కుక్క... కాటేసింది... బాబూ... అమ్మో... రగతం..."

"అసలు లోపలికెందుకొచ్చావ్ నువ్వు? వెధవ న్యూసెన్స్! జానీ! జానీ!" డాక్టర్ అరిచాడు.

సుంకయ్య వరండాపైకి వెళ్ళాడు. కొద్దిగా వొంగిన అతని అరచెయ్యి రక్తసిక్తంగా వుంది. డాక్టర్ వైపు దీనంగా చూశాడతను.

డాక్టర్ కరుణాకరం విసుగు చూపులు చెమటలు కమ్మిన సుంకయ్య మొహం మీంచి అతని పిక్క మీదికి దిగాయి. కిందికి కారిపోతున్న నెత్తురు వరండా మీద చిన్నగా మడుగు కట్టుతోంది.

"అయ్యగారూ..."

"ఆ బెంచీ మీద కూచో..." డాక్టర్ కరుణాకరం చిరాగ్గా అంటూ గుమ్మం వైపు తిరిగాడు.

పిక్కని ఆశ్రయించి, శరీరమంతా ఆక్రమిస్తున్నట్టున్న ఏదో మంటా, సలుపూ కడుపు నొప్పిని ఎక్కడికో తరిమేశాయి... పిక్క... రిక్షా... తను... ఈ గాయంతో రిక్షా ఎలా తొక్కాలి, రేపట్నుంచీ..?

"ఇదుగో ఈ కాటన్తో రక్తం తుడిచేసుకో!" డాక్టర్ కంఠం సుంకయ్య ఆలోచనలకి అడ్డు పడింది.

బెంచీ మీద డాక్టర్ పడేసిన కాటన్ని అందుకుని సుంకయ్య వణుకుతున్న చేత్తో రక్తాన్ని తుడవడం ప్రారంభించాడు. ఇసుక లోంచీ ఊరుతున్న చెలమలా రక్తం ఆగకుండా ఊరుతూనే వుంది.

అసహనంగా పిడికిళ్ళు బిగిస్తూ, వదులు చేస్తూ మంచున్న డాక్టర్ కరుణాకరానికి కారు హారన్ విసుగ్గా వినిపించింది. త్వరలో భార్య విసుగు ఆగ్రహంగా ఎదిగి పోతుందని అతనికి తెలుసు...

కరుణాకరం చిరాగ్గా నిట్టూరుస్తూ కిందికి వంగాడు. ఎడం చేత్తో గాయాన్ని ఒకసారి తుడిచి, చకచకా బ్యాండేజీ చుట్టడం ప్రారంభించాడు. ఎర్రరంగు పులుముకుంటున్న బ్యాండేజీని పట్టించుకోకుండా లేచి మంచున్నాడు.

"బాబుగారూ... కుక్కకాటు... కాటు... ఫర్వాలేదంటారా? ఈ కట్టు..." సుంకయ్య వణికే కంఠంతో ప్రారంభించాడు. కారు హారన్.

"చాలదు.... బొడ్డు చుట్టూ ఏడు ఇంజెక్షన్లు వేసుకోవాలి..." డాక్టర్ విసుగుని దిగమింగుతూ అన్నాడు.

"ఎయ్యండి....బాబు...."

"ఏమండోయ్! దిగి, వచ్చేయమన్నారా?" కార్లోంచి భార్య కంఠం డాక్టర్ని చెంపపెట్టులా తాకింది.

"వస్తున్నా!" కారువేపు అరిచి, అతను సుంకయ్య మొహంలోకి చూశాడు. "చూడవయ్యా... ఇంజెక్షన్లు... బోలెడు ఖర్చుతోపని.... కనీసం వంద రూపాయలు...."

"వొందరూపాయలే! కడుపు నొప్పికి తమకాద మాత్తర్లు అడ్డుక్కోడానికొచ్చాను.... కుక్కకి చిక్కిపోయాను..... దయచూపండి.....బాబూ.....తమ కుక్కేగా....."

"కుక్కవాడే... అయితే? కుక్కకాటు మందు ఇక్కడుండదు. ధర్మాసుపత్రికెళ్ళు..."



గవర్నమెంట్ హాస్పిటల్ కూమార్ మంచీ తెప్పించుకున్న కుక్కకాటు మందు, తన లాంటి ప్రైవేటు డాక్టర్లకి, గుట్టుచప్పుడు కాకుండా సరఫరా అయిపోతుందని తెలిసిన డాక్టర్ కరుణాకరణం విసుగ్గా అన్నాడు.

"బాబూ..... ధర్మాసుపత్రిర్లో..." సుంకయ్య సందేహిస్తూ ఏదో చెప్ప బోయాడు.

"అసలు కుక్క మంచిదే. ఆ మాట కొస్తే ఇంజెక్షన్ల అవసరమే లేదు... రేపొద్దునరా... రెండు మాత్రలిస్తా. గాయం మానిపోతుంది....."

"బాబుగారూ.... కడుపులో కూడా నొప్పి... ఉన్నట్టుంది", తన కడుపు నొప్పిని గుర్తు చేసుకుంటూ అన్నాడు సుంకయ్య.

"అబ్బబ్బ! ముందు కాలి సంగతి చూసుకో వయ్యా.

కడుపు తరవాత...లే! పద... గేటు దాటిస్తా... కుక్క తిరుగుతూ వుంటుంది....."

సుంకయ్య నిస్పృహాయంగా లేచాడు.....

"సార్.... ఎవరో సుంకయ్యట.... రాత్రి మనకుక్క కరిచిందట. పొద్దుటే రమ్మన్నారట మీరు.. బైట కాచుక్కూచున్నాడు....." అంది నర్సు.

డాక్టర్ కరుణాకరం విసుగ్గా చూశాడు.

"ఎవడి కుక్క కరిస్తే వాడే ఇంజెక్షన్లు, వేసి వైద్యం చేయాలా ఏమిటి? డాక్టర్‌గారి కుక్క కాబట్టి ఇక్కడికొచ్చాడు, బ్లాక్ మెయిల్ చేయడానికి! అదే ఏ పేషెంట్‌గారి కుక్కో అయితే? ధర్మాసుపత్రికి దయచేయమను. లేదంటే వంద రూపాయలు పట్టమ్మను..." డా. కరుణాకరం ఉక్రోషంతో అన్నాడు.

నర్సు ముందు గదిలోకి నడిచింది. తలుపు పక్కనే బెంచీమీద వుండాల్సిన సుంకయ్య కోసం ఆమె కళ్ళు వెతికాయి. సుంకయ్య లేదు.

డాక్టర్ తన గురించి నర్సుతో అన్న మాటల్ని, ఆమె నోటమ్మట మరో సారి వినడం ఇష్టంలేని సుంకయ్య అప్పటికే గేటుదాటి, రోడ్డు మీదకి తిరిగేశాడు.....

క్లినిక్‌లో బాయ్‌గా ఇంట్లో నౌకరుగా డబుల్ రోల్ నిర్వహిస్తున్న చిదంబరం డాక్టర్ టేబుల్ ముందు నిలబడ్డాడు. కలెక్షన్ పైకాన్ని లెక్క పెట్టుకోడంలో మునిగిపోయిన కరుణాకరం అతని ఉనికినే పట్టించుకోలేదు.

"సార్...." చిదంబరం ధైర్యం చేసి పిలిచాడు.

నోట్లలెక్కని ఆపి, కరుణాకరం విసుగ్గా చూశాడు

"సార్....జానీ... అదోలా వుంది. మునుపట్లా ఉషారుగా లేదు..... చొంగ కారుస్తోంది...."

కరుణాకరం అర్థం కానట్టు చూశాడు.

"ఈ మధ్య ఏదో పిచ్చికుక్క మన కాంపౌండ్‌లోకి వచ్చిందిట... మొన్నో, ఆ మొన్నో.... అన్నాడు గూర్ఖా... నాకు.... అనుమానంగా వుందిసార్...." చిదంబరం ఆగుతూ, ఆగుతూ అన్నాడు.

కరుణాకరం కంగారుగా రెండు చేతుల్లో పట్టుకున్న నోట్లని సొరుగులోకి తోసి పైకి లేచాడు.

* * *

"నో డౌట్, డాక్టర్ రాబిస్!"

డా. కరుణాకరం నమ్మలేనట్టు చూశాడు.

"ట్రీట్‌మెంట్..." డాక్టర్ కరుణాకరం ఎవరో పేషెంట్‌కి తోడుగా వచ్చిన మామూలు వ్యక్తిలా దీనంగా అన్నాడు.

వెటర్నరీ సర్జన్ అతన్ని సానుభూతితో చూశాడు

"ధర్మవరం, కంచీ, గద్వాల్ పట్టుచీరెలు, పాలియెస్టర్, టెర్లీన్, అమెరికన్ జార్జెట్ చీరెలు, ఇన్ని చూపి పోతున్నారు-కొనడానికి ఒక్క చీరైనా నచ్చలేదా?" విసుగ్గా అన్నాడు షాపతను.

"అవేమీ 'టీ' వడకట్టడానికి పనికిరావుగా..." సమాధానమిచ్చారు కాంతమ్మగారు.

—ఏనుగు కిశోర్‌బాబు, న్యూఢిల్లీ

"మీకు తెలుసు! అయాం సారీ...."

డాక్టర్ కరుణాకరం బరువుగా నిట్టూర్చాడు.

" ఈ మునిసిపాల్టీ వాళ్లు ఏం చేస్తుంటారో అర్థం కాదు. పిచ్చికుక్కల్ని విచ్చలవిడిగా వదిలేస్తారు!"

వెటర్నరీ సర్జన్ అవునన్నట్టు తలూపాడు. "యస్ వాళ్ళు జాగర్త పడాలి...."

డాక్టర్ కరుణాకరం అయోమయంగా చూశాడు. "డాక్టర్ .... అయితే ఏం చేద్దామంటారు?"

"ఏం చేస్తాం..? మునిసిపాల్టీవాళ్లు చేయనిపని మనం చేయాలి..." వెటర్నరీ సర్జన్ నవ్వుతూ అన్నాడు.

డాక్టర్ కరుణాకరం మళ్ళీ నిట్టూర్చాడు "జానీ అంటే నా భార్యకి ప్రాణం... ఆమె కుప్పకూలిపోతుంది....."

"అయాంసారీ..." వెటర్నరీ సర్జన్ జాలిగా అన్నాడు.

డాక్టర్ కరుణాకరం తన కన్‌సల్టింగ్ రూమ్‌లో ఒంటరిగా కూచున్నాడు. ఆర్రోజుల క్రితం భూస్థాపితం అయిపోయిన జానీ అతనికి గుర్తొస్తోంది. రెండు వారాల కిందటే— పాపం— జానీ క్రాస్ అయింది. కనీసం నాలుగు పిల్లల్నేనా పెడ్తుందని తనూ, భార్యా ఆశపడ్డారు. కరుణాకరం అప్రయత్నంగా నిట్టూర్చాడు.

గుమ్మం ముందు అలికిడి అతని ఆలోచనల్ని భగ్నం చేసింది. ఇవాళ తన క్లినిక్‌కి శలవు.

తనిక్కడికి రాకుండా వుంటే బావుండేది. విచారంతో, జానీ దూరం అయిపోతూ దగ్గర చేసిన విచారంతో ఇంకా కుళ్ళి పోతున్న భార్య మొహం చూడలేక తను ఇలా వచ్చాడు.....

గుమ్మం ముందు ప్రత్యక్షమైన వ్యక్తిని పోల్చుకోడానికి అతనికి రెండు క్షణాలు పట్టింది.

సుంకయ్య... అతని గెడ్డం బాగా ఏదో మత్తు మందు సేవించిన వ్యక్తిలా, కళ్ళు పూర్తిగా తెరుచుకుని నిద్రపోతున్న వ్యక్తిలా వున్నాడు సుంకయ్య. పక్కనే నుంచున్న స్త్రీ అతన్నిరెండు చేతుల్తో జాగర్తగా పట్టుకుంది. ఆమె కళ్ళు బెదురు బెదురుగా చూస్తున్నాయి. ఆ బెదురు వెనక ఏదో ఆవేదన స్పష్టంగా అవుపిస్తోంది. జానీ సంగతి తన ద్వారా విన్నప్పుడు తన భార్య కళ్ళల్లో ఇలాంటి భావాలే ప్రత్యక్షం కావడం అతనికి గుర్తొచ్చింది.....

"బాబు గారూ.." నోరు మెదపకుండా తన వేపే చూస్తున్న డాక్టర్ని చూస్తూ, వణికే కంఠంతో అంది సుంకయ్య భార్య సరస. "మావని... తమ జాతి కుక్క కర్పిందిట. తమరు వొంద రూపాయలు తెమ్మన్నారంట..... లేకపోతే.... ధర్మాసుపత్రి కెళ్ళమన్నారట.....

అక్కడ కుక్క మందు లేదన్నారు....." ఆమె అప్రయత్నంగా గదిలోకి సుంకయ్యని వడిపించుకొచ్చింది.

డాక్టర్ కరుణాకరం మాట్లాడలేదు. అతని కళ్ళు మార్చి మార్చి ఇద్దర్నీ చూస్తున్నాయి. సుంకయ్య కాలుగ్రాయం ఏదో దుర్వాసనని లీలగా వెదజల్లుతోంది.

"మావ ... తనను తమ దగ్గిరికే తీసికెల్ల మని పోరుపెట్టేసిందు.

"ఆ డాకటరు బాబే నాకు బాగు సేత్తాడు. ఆయన కుక్క సంగతి ఆయనకే తెలుసు. ఆ డాకటరు బాబు దగ్గిరికే తీసుకెల్లు ... వొంద రూపాయిలు సంపాయించి తీసుకెల్లు!' అంటూ ఒకటే గోలసేసిందు ..." ఏడుపు ఆమెకి అడ్డు పడింది.

"ఎట్టాగో తంటాలుపడి, కూలిచేసీ, అప్పు చేసీ యాభై రూపాయిలు పోగు చేసినా..." అంటూ ఆమె సుంకయ్యని వదలి, చీర కొంగు ముడి విప్పింది. నలిగిపోయిన నోట్లనీ, చిల్లర నాణేల్నీ టేబుల్ మీద కుప్పగా పోసింది. నీళ్ళతో నిండిన కళ్ళని మెల్లిగా డాక్టర్ వైపు పైకెత్తింది.

"రెండు రోజులుగా ... మావ ... అదోలా అయిపోయాడు ... పెదవిప్పి పలకడం లేదు.

నీళ్ళు కనబడగానే కుక్కల్లే అరుత్తున్నాడు. ... నాకు ... శానా ... బేజారుగా ... వుంది ... వారం రోజుల్లో... మరో యాభై సర్దుత్తాను... నా మావకి ... బాగుసేయండి'' ఆమె బావురు మంది.

డాక్టర్ కరుణాకరం చూపుల్ని ఆమె మీంచీ సుంకయ్య మొహం మీదికి మళ్ళించాడు. రెప్ప పాటు లేని సుంకయ్య కళ్ళల్లోకి అప్రయత్నంగా చూశాడు. చప్పుడు కాకుండా వంట గదిలోకి దూరి దొరికిన వస్తువుని దోచుకుపోయే దొంగ కుక్కలా, సుంకయ్య కళ్ళల్లో మృత్యువు తొంగి చూస్తోంది... హైడ్రోఫోబియా!

తన చూపుల్ని సుంకయ్య మొహం మీంచీ అతని భార్య మీదికీ, ఆమె మీంచీ యాభై రూపాయిల కుప్పమీదికీ మళ్ళించాడు డా. కరుణాకరం.

యాభై రూపాయిలు ... మరో యాభై రూపాయిలు కాదు. . .

సుంకయ్యా అతని భార్యా - వాళ్ళిద్దరి ఎత్తూ ధనం రాశిగా పోసినా సుంకయ్య బతికే అవకాశం లేదు! జానీకి పిచ్చి అని తేలేక, సుంకయ్య కనిపించి వుంటే తను ఏదో చేసి వుండే వాడేమో ...తనిప్పుడు జరగబోయే నిజం చెప్తే వాళ్ళిద్దరూ మరో డాక్టర్ని కల్సుకుంటారు. ఆ యాభై లాక్కుని సూది పొడిచి, వెళ్ళమంటాడు ఏ డాక్టరైనా ...!ఆ పని తనే చేస్తే మరేం నష్టం లేదు ... అందువల్ల వాళ్ళిద్దరూ తృప్తి పడతారు. కావాలంటే మరో యాభై వద్దని తను చెప్పగలడు.

ఆలోచిస్తున్న కరుణాకరం చెయ్యి కొద్దిగా కదిలింది. 'ఆ యాభై కూడా వద్దు తీసుకెళ్ళు' అనమంటూ అతని లోపల్నుంచీ ఎవరో మనిషి తగ్గు స్వరంలో చెప్తున్నాడు. డొనేషన్లు కట్టి, బోలెడంత ఖర్చుపెట్టి, మెడిసిన్ చదివి, భార్య తెచ్చిన కట్నం ద్వారా కూడా ఆ ఖర్చుని పూర్తిగా పూడ్చుకోలేకపోయిన ఇవతలి మనిషి చెయ్యి పూర్తిగా కదిలి, సరస టేబుల్ మీద పెట్టిన యాభై రూపాయిల కుప్పని చీపురులా టేబుల్ సొరుగులోకి తోసింది...

సుంకయ్యని గోడవారగా వున్న బెంచీ మీద పడుకోబెట్టమని ఆమెకి చెప్పి లోపలి గదిలోకి వెళ్ళాడు. ఫ్రిజ్ తెరిచాడు. గవర్నమెంట్ హాస్పిటల్ నుండీ గమ్మత్తుగా తన ఫ్రిజ్‌లోకి చేరిన కుక్కకాటు మందు వయల్ ఇవతలికి తీశాడు...

సుంకయ్య బెంచీ మీద వెల్లకిలా పడుకున్నాడు. పక్కనే నిలబడ్డ సరస, సుంకయ్య తల వేపు వెళ్ళి,

రాధ ఇంటర్వ్యూకి వెళ్ళింది. ఇంటర్వ్యూలో అడిగారు.

''నీకు పెళ్ళయిందా'' అని ''లేదండీ'' ఎందుకైనా ఘంచిదని అబద్ధం చెప్పింది రాధ.

''అయితే... సారీ ఈ ఉద్యోగం పెళ్ళయిన వారికి మాత్రమే''.

''అయితే మా ఆయనకు పెళ్ళయింది. ఆయనకు ఈ ఉద్యోగం ఇస్తారాండీ''

— సి. శ్రీనివాసమూర్తి, హిందూపురం

అతని రెండు భుజాల్నీ సున్నితంగా పట్టుకుంది.

గది కప్పుని చూస్తున్న సుంకయ్య కళ్ళు తటాలున డాక్టర్ కరుణాకరం వైపు కదిలాయి. సిరెంజ్ లోడ్ చేస్తూ అప్రయత్నంగా సుంకయ్య కళ్ళల్లోకి చూశాడు డా. కరుణాకరం. అతని కళ్ళు చెదిరి నట్టయ్యాయి.

సుంకయ్య మొహంలోంచీ జానీ కళ్ళు తన కళ్ళల్లోకి తదేకంగా చూస్తున్నట్టనిపించిందతనికి ... తను బిస్కెట్ ఇవ్వకుండా పనిష్ చేసినప్పుడు తనని అదోలా చూసిన జానీ కళ్ళు!

సిరెంజి పట్టుకున్న డా. కరుణాకరం చేతులు చిన్నగా వణికాయి. సర్దుకుని మళ్ళా సుంకయ్య కళ్ళల్లోకి చూశాడతను. కామెర్ల కళ్ళలా కొద్దిగా పసుప్పచ్చగా ... జానీ కళ్ళలా కొద్దిగా పచ్చగా ... అవుపిస్తున్నాయి సుంకయ్య కళ్ళు...

చూపుల్ని తిప్పుకుని, సుంకయ్య మురికి పంచెను అతని బొడ్డు కిందికి జరపడానికి ఉద్యుక్తుడయ్యాడు డా. కరుణాకరం.

సుంకయ్య కళ్ళు రెప్పపాటు లేకుండా అతన్నే చూస్తున్నాయి. ఏదో కొత్తరకం నిద్రలోకి జారుకున్న అతనిలోని మనిషి మెల్లిగా ... మెల్లిగా మేల్కొంటున్నాడు. ఎవరిదో కంఠం డాక్టర్ కంఠం ... అతని ... చెవుల్లో తలగా ... ధ్వనిస్తోంది... 'ధర్మాసుపత్రికి దయచేయమను!'

సుంకయ్యలో మేల్కొంటున్న మనిషి మళ్ళీ మెల్లిగా కొత్త నిద్రలోకి జారుకుంటున్నాడు. మరేదో ... మరేదో ... కుక్క ... అతని లోంచీ పైకిలేస్తోంది... అతని కళ్ళని ఏదో మార్పు పొరలా కప్పేసింది. డాక్టర్ని చూస్తూ భీకరంగా మొరగాలనిపిస్తోందతనికి... కుక్క ... మనిషి ... కుక్క ... మనిషి ... సుంకయ్య లోంచీ మనిషీ, కుక్కా ఒకర్నొకరు అదిమేస్తూ పైకి లేస్తున్నారు... కుక్క ... మనిషి ... కుక్క...

సుంకయ్య బొడ్డు చుట్టూ కాటన్‌తో తుడిచి, డాక్టర్ కరుణాకరం సిరెంజీని వాటంగా పట్టుకున్నాడు. ''జాగర్తగా కదలకుండా పట్టుకో ...'' అన్నాడు తలవాల్చుకునే.

పరస చేతులు సుంకయ్య భుజాల్ని ఆప్యాయంగా అదిమాయి. సూది సుంకయ్య పొట్ట మీద దిగుతోంది ... సుంకయ్య తల ఆవేశంగా అటూ ఇటూ ఊగింది.

సుంకయ్య కళ్ళు అతని పొట్టనే చూస్తున్న డాక్టర్ కరుణాకరం మీదే కేంద్రీకరింప బడ్డాయి. సుంకయ్య రెండు చేతులూ కదిలాయి. వెంటనే అతని రెండు కాళ్ళూ కదిలాయి...

డాక్టర్ కరుణాకరం గుచ్చుకున్న సూదికి రెండు వైపులా సుంకయ్య పొట్టని చూపుడు వేలితో, బొటనవేలితో మరి కొంచెం నొక్కాడు.

ఈసారి సుంకయ్య రెండు చేతులూ, రెండు కాళ్ళూ ఒకేసారి కదిలాయి. సుంకయ్య లోపలి ప్రాణి నాలుగు కాళ్ళూ ఒకేసారి కదిలాయి. సుంకయ్య మెరుపులా పైకి లేచాడు.

ఆ ఊపుకు డా. కరుణాకరం చేతిలో ఇరుక్కున్న సిరెంజి సుంకయ్య పొట్ట మీంచీ జారి, విసురుగా కిందపడి, చప్పుడు చేసింది.

బిత్తరపోయిన డా. కరుణాకరం కోపంగా సుంకయ్య వేపు చూడ్డానికి ప్రయత్నించాడు. సుంకయ్య చేతులు, ఏదో జంతువు ముందరి కాళ్ళల్లా డాక్టర్ భుజాల మీద మొరటుగా ఆనాయి.

ఏం జరుగుతూందో గ్రహించేలోగా డాక్టర్ కరుణాకరం ముంజేతి చుట్టూ సుంకయ్య పళ్ళు రభసం పళ్ళలా బిగుసుకున్నాయి. డాక్టర్ కరుణాకరం అసంకల్పితంగా అరిచాడు. సుంకయ్య పళ్ళు వాడికోరల్లా అతని ముంజేతిలోకి దిగుతున్నాయి. డాక్టర్ కరుణాకరం అరుస్తూనే వుండిపోయాడు.

జరుగుతుందేమిటో అర్థం చేసుకుని, సరస కంగారుగా భర్త భుజాల్ని పట్టుకుని దూరంగా లాగింది. అప్పటికే సుంకయ్య పళ్ళు డాక్టర్ కరుణాకరం ముంజేతి మీద లోతుగా గాయం చేశాయి. రక్తం వోడుతున్న ముంజేతిని అరచేత్తో కప్పుకుని డాక్టర్ కరుణాకరం సుంకయ్య మొహం లోకి ఆదుర్దాగా చూశాడు. సుంకయ్య కళ్ళలోంచీ జానీ కళ్ళు రౌద్రంగా చూస్తున్నాయి.

''అయ్యో అయ్యో ... గాయం అయి పోనాది బాబూ... రగతం తుడుసుకోండి ...'' సరస భయంతో వణికింది.

జవాబుగా డాక్టర్ కరుణాకరం కెవ్వుమని భీకరంగా అరుస్తూ కుప్పకూలిపోయాడు.

డాక్టర్ కరుణాకరం ఆరోజే మరణించాడు. రిక్షావాడు - సుంకయ్య మూడు రోజుల తరువాత చచ్చిపోయాడు.